క్లుప్తంగా

'స్పందన' ఫిర్యాదులను పరిష్కరించాలి



సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కార్తీక్

పెనుకొండ రూరల్: స్పందనలో అందిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సబ్ కలెక్టర్ కార్తీక్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండలంలోని దుద్దే బండ గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందులో భాగంగా పలు రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సమయపాలన తప్పక పాటించాలన్నారు. సంక్షేమ పథకాలపై ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

ఉచిత విద్యకు విద్యార్థుల ఎంపిక

అమరాపురం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు స్వధ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత విద్యకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుజాత శుక్రవారం తెలిపారు. గత నెలలో బెంగళూరులోని స్వధ స్వచ్ఛంద సంస్థ వారు ఉమ్మడి జిల్లా అనంతపురంలో ఇంటర్ విద్యార్థులకు అర్హత పరీక్ష నిర్వహించారని, ఇందులో అమరాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి సెకెండియర్ విద్యార్థులు ఎస్.సంధ్యారాణి, సి.దర్శిని, వి.రచన, ఫస్టియర్ విద్యార్థి టీఆర్.బిందు ఎంపికయ్యారన్నారు. వీరికి నాలుగేళ్ల పాటు కళాశాల ఫీజు, ఉచిత వసతి, పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫారం తదితర సౌకర్యాలు సమకూరుస్తారని తెలిపారు. అధ్యాపకులు సుమన్‌లాల్‌నాయక్, జగన్నాథ్ తదితరులు ఉన్నారు.

జేడీఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

పావగడ: తాలూకాలోని ఇంద్రబెట్ట గ్రామానికి చెందిన జేడీఎస్ నాయకులు గోపాలప్ప, రామచంద్రప్ప, కేశప్ప, పాత లింగప్ప, హనుమంత రాయప్ప, నారాయణ, పాత లింగప్ప తదితర నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ తీర్థం పుచుకున్నారు. ఆ గ్రామంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకుడు హెచ్‌వీ వెంకటేశ్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

లేపాక్షి ఆలయంలో పూజలు



అలంకరణలో దుర్గాదేవి

లేపాక్షి: స్థానిక వీరభద్రస్వామి దేవాలయంలో శుక్రవారం ఉదయం దుర్గాదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయ ఆవరణలో దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం అభిషేకార్చనలు, తీర్థప్రసాదాలు, మహామంగళారతి తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

హోంగార్డులకు ప్రశంసాపత్రాలు



ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న హోంగార్డు శివకుమార్

రొద్దం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు ఆనంద్, శివకుమార్ శుక్రవారం పుట్టపర్తిలో ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ చేతులమీదుగా ప్రశంస పత్రాలు అందుకున్నారు. హోంగార్డుల డీ మొబిలైజేషన్ పరేడ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో ప్రశంసా పత్రాలు అందుకున్నట్లు హోంగార్డులు హర్షం వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యం

- ఉమ్మడి అనంతపురం జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ శివరామిరెడ్డి



మడకశిర: మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీ మంగమ్మ, ఎమ్మెల్యేలు తిప్పేస్వామి, శంకరనారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

మడకశిర: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డి ఘనవిజయం సాధించాలని, ఇందుకోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఉమ్మడి అనంతపురం జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ వైశివరామిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి ఇంటి ఆవరణలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్‌ల సమావేశం జరిగింది. ఎమ్మెల్యే తిప్పేస్వామి అధ్యక్షత వహించారు. శివరామిరెడ్డి మాట్లాడుతూ పార్టీ శ్రేణులు ఈఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని పని చేయాలని కోరారు. చంద్రబాబు హయాంలో రాష్ట్రం దోపిడీకి గురైందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రారంభించిన ప్రతి మంచి పనికి టీడీపీ అడ్డుపడిందని విమర్శించారు. ఇంగ్లిష్ మీడియం, పేదల ఇళ్ల పట్టాలు తదితర మంచి పనులను అడ్డుకోడానికి టీడీపీ ప్రయత్నించిందని ధ్వజమెత్తారు. చంద్రబాబు డబ్బున్న వారికే పదవులు ఇచ్చేవారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సామాన్య కార్యకర్తలకు కూడా పదవులిచ్చి గౌరవించారని తెలిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఓడిపోతే ఆపార్టీ ఇక రాష్ట్రంలో ఉండదని తెలిపారు. ఈవిషయాన్ని గుర్తించి పార్టీ కార్యకర్తలు పని చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పెనుకొండ ఎమ్మెల్యే శంకర్‌నారాయణ మాట్లాడుతూ పార్టీ శ్రేణులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో సమష్టిగా పని చేసి పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి ఓట్లడగాలని కోరారు. ఈ ఎన్నికలను ఏమాత్రం నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ఎమ్మెల్సీ మంగమ్మ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల విజయాన్ని వైఎస్ జగన్‌కు కానుకగా అందించాలని కోరారు.

ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ పార్టీ శ్రేణులు ఈఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని కోరారు. ప్రతి గ్రామంలో ఓటరును కలిసి ఓట్లను అభ్యర్థించాలన్నారు. మడకశిర నియోజకవర్గంలో తమ పార్టీ అభ్యర్థులకు అత్యధిక మెజార్టీ రావాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు చేసే ప్రచారాన్ని తాను రోజూ సమీక్షిస్తానని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు నరసింహులు, మండల జేసీఎస్ కన్వీనర్లు నాగేంద్ర, శివకుమార్, శివన్న, శ్రీనివాస రెడ్డి, రొళ్ల నాగేంద్ర, ఈశ్వర్, ఎంపీపీలు రాధమ్మ, ఈరన్న, కవిత, జెడ్పీటీసీలు స్వారక్క, సరోజమ్మ, భూతరాజు, మార్కెట్‌యార్డు చైర్మన్ జయరామప్ప, మండల కన్వీనర్లు మహేంద్ర, రామిరెడ్డి, డైరెక్టర్లు ఈరక్యాతరాయప్ప, నేత్రావతి, గగన, రాజేశ్వరి, బిదురమ్మ, నాగలక్ష్మమ్మ, వైస్ ఎంపీపీలు మూర్తి, కృష్ణమూర్తి, శ్రీరామిరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు చిక్కన్న, చంద్ర, జయ రామప్ప, రామిరెడ్డి, మోతీరామ్‌నాయక్, ముఖ్య నాయకులు చంద్రప్ప, సత్యనారాయణరెడ్డి, జమ్మానిపల్లి మూర్తి, యంజారేగౌడ్, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి

హిందూపురం: వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న పశ్చియ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత 1 సంఖ్యతో ఓటు ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉపేంద్ర రెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు లోకేష్ శుక్రవారం స్థానిక ముదిరెడ్డిపల్లి, సింగిరెడ్డిపల్లి, దండురోడ్డు ప్రాంతాల్లోని పట్టభద్రులు, టీచర్లు, సచివాలయ సిబ్బందిని కోరుతూ కరపత్రాలు అందించి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతు పలకాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రణయ్ రెడ్డి, మనోజ్‌గౌడ్, అమర్నాథ్, నితిష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



హిందూపురం: సచివాలయ సిబ్బందిని ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి

పరిగి: ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, ప్రతి గ్రామంలోనూ వైద్యారోగ్యశాఖ అధికారులు నిత్యం పర్యవేక్షించి, ప్రజల బాగోగులను పరిశీలించాల్సిన బాధ్యత ఉంటుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన పరిగి మండలంలో విస్తృతంగా పర్యటించారు. ధనాపురం, సీతారాంపురం కాలనీతో పాటూ పరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికల సంరక్షణ అందరి బాధ్యత అన్నారు. దీంతో పాటూ గర్భవతులు, బాలింతల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. ధనాపురంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. వైద్యారోగ్యశాఖలో ఏవైనా పొరబాట్లు ఉంటే సరిదిద్దుకోవాలని సిబ్బందికి సూచించారు. అదే విధంగా బేటీ బచావో.. బేటీ పడావోపై అవగాహన కల్పించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ నవీన, డాక్టర్ స్వరూపరెడ్డి, సీహెచ్‌ఓ వన్నప్ప, మలేరియా అధికారి లక్ష్మీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రారెడ్డిని గెలిపించండి



గుడిబండ: వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేస్తున్న నాయకులు

మడకశిరరూరల్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో నిలిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని పట్టభద్రులకు వైఎస్సార్‌సీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కదిరేపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టభద్రుల ఇంటి వద్దకు వెళ్లి రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కరపత్రాన్ని అందజేశారు. సర్పంచ్ నరసయ్యగౌడ్, ఎంపీటీసీ నరసింహమూర్తి, మండల జగనన్న సచివాలయం కన్వీనర్ నాగేంద్ర యాదవ్, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మంజునాథ, నాయకులు రంగనాథ, ఈరేగౌడ్ తదితరులు ఉన్నారు.

గుడిబండ: వైఎస్సార్‌సీపీ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గుడిబండ జెడ్పీటీసీ భూతరాజు, జేసీఎస్ కన్వీనర్ కె.శివకుమార్ కోరారు. శుక్రవారం వారు ప్రభుత్వ పాఠశాలలు, సచివాలయాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అమరాపురం ఎంపీపీ ఈరన్న, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ రమేష్, అంబరీష్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యమందించండి



రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి ఎస్‌వీ కృష్ణారెడ్డి

మడకశిరరూరల్: రోగులకు మెరుగైన వైద్యమందించాలని జిల్లా వైద్యాధికారి ఎస్‌వీ కృష్ణారెడ్డి సిబ్బందికి సూచించారు. ఆయన శుక్రవారం కల్లుమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం సీజనల్ వ్యాధులు, వైఎస్సార్ ఫ్యామిలీ డాక్టర్ సేవలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న సేవలు, రోజు ఎంత మంది పీహెచ్‌సీకి చికిత్స నిమిత్తం వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ అప్రమత్తం చేయాలన్నారు. విధి నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. వైఎస్సార్ ఫ్యామిలీ డాక్టర్ సేవలపై ప్రజలకు మరింతగా అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధుల నివారణపై నిర్వహించిన అవగాహన ర్యాలీ పాల్గొన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి లక్ష్మానాయక్, డివిజన్ మలేరియా అధికారి కోదండ రామిరెడ్డి, డాక్టర్ వినోద్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సురేష్‌కుమార్

పరిగి: ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులకు సిద్ధంగా ఉండాలని తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎస్‌ఐ నరేంద్ర, ఎంపీడీఓ సరస్వతి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మండల బీఎల్వోలు, వీఆర్వోలు, ఎన్నికల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఓటు ఎలా వేయాలి? ఎలా వేయకూడదు అన్న అంశాలపై అవగాహన కల్పించారు. ఓటర్లు నిష్పక్షపాతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. అనంతరం పరిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ను అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దారు లక్ష్మీనరసింహం పాల్గొన్నారు.

గోరంట్ల: ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని తహసీల్దార్ రంగనాయకులు కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై రాజకీయ పార్టీ ముఖ్య నాయకులకు అవగాహన కల్పించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘునాథగుప్తా, ఈఓఆర్డీ సతీష్‌కుమార్ తదతరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగం పై అవగాహన

అమరాపురం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై తహసీల్దార్ సురేష్‌కుమార్ సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఆయన సచివాలయం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మునిస్వామి, గ్రామ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సదస్సు జయప్రదం చేయండి



మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘాల నాయకులు

హిందూపురం టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 5న తెనాలిలో రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ మహిళా సదస్సును ఏర్పాటు చేసినట్లు ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘం మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి కౌసల్య తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆమెతో పాటు ఏపీ బ్రాహ్మణ సమాఖ్య, బ్రాహ్మణ అన్యాక్రాంత ఆస్తుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సముద్రాల హనుమంతరావు విలేకరుల సమావేశం నిర్వహించారు. బ్రాహ్మణ మహిళా విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన బ్రాహ్మణ మహిళలు, ఉన్నత ఉద్యోగాల్లో ఉన్న వారిని 5న జరిగే రాష్ట్ర స్థాయి సదస్సులో సత్కరిస్తామన్నారు. సదస్సుకు రాష్ట్రవ్యాప్తంగా మహిళలందరూ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బ్రాహ్మణ సంఘం నాయకులు రాఘవేంద్ర, సంపత్ కుమార్, కృష్ణ చైతన్య, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి: ఈనెల 5న తెనాలిలో జరిగే మహిళామూర్తుల సమావేశాన్ని విజయవంతం చేయాలని బ్రాహ్మణ సేవాసంఘం మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి కౌసల్య శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

18న కన్నడ సాహిత్య సమ్మేళనం

పావగడ: ద్వి భాష ప్రాతినిధ్యమైన పావగడలో 7 వ కన్నడ సాహిత్య సమ్మేళనం ఈ నెల 18 న నిర్వహించనున్నట్లు స్థానిక కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్ఎస్‌కే రంగమందిరంలో నిర్వహించే సమ్మేళనంలో రెండు విచార గోష్ఠులు, ఒక కవి గోష్ఠి, వివిధ రంగాలలో విశిష్ఠ సేవలందించిన ప్రముఖులకు సన్మానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆరేళ్లపాటు తాలూకా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడిగా, గడినాడు కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడిగా సేవలందించిన హెచ్ రామచంద్రప్పను సమ్మేళనం సర్వాధ్యక్షుడిగా నియమించామని పేర్కొన్నారు.

'అసమ్మతి' చూపు ఎటు వైపు?

పావగడ: స్థానిక కాంగ్రెస్, జేడీఎస్‌లో నెలకొన్న విబేధాల కారణంగా ఏర్పడిన అసమ్మతి వర్గాలు ఈ ఎన్నికల్లో ఏ పార్టీకి మద్దతు ఇస్తాయోనన్న సందిగ్ధత రాజకీయ వర్గాల్లో నెలకొంది. ముఖ్యంగా జేడీఎస్ లో అసమ్మతి అంతంత మాత్రంగానే ఉన్నా కాంగ్రెస్‌లో ఎక్కువగా కన్పిస్తోంది. స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణప్ప కుమారుడు వెంకటేశ్‌కు టికెట్టు రానివ్వకుండా కాంగ్రెస్ అసమ్మతి వర్గం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఆ టికెట్‌ను స్థానిక మాజీ ఎమ్మెల్యే సోమ్లానాయక్ కుమార్తె గాయత్రిబాయి, కోర్టు నరసప్ప, మాజీ ఎంపీ చంద్రప్పలలో ఎవరికో ఒకరికి వచ్చేలా తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా జేడీఎస్ టికెట్ మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్పకు ఖరారు కావడంతో అసమ్మతి వేడి కాస్త చల్లారింది. అయితే ఆ పార్టీ సీనియర్ నేత మానం వెంకటస్వామి జేడీఎస్‌తో అంటీముట్టనట్లు ఉండటంతో కాంగ్రెస్ వైపు మొగ్గు చూపు తున్నట్లు తెలుస్తోంది. ఇక గాలి జనార్దనరెడ్డి సారథ్యంలోని కేఆర్‌పీపీ అభ్యర్థి నేరళకుంటి నాగేంద్ర ఆ రెండు పార్టీల అసమ్మతి నాయకులను తన వైపు తిప్పు కునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

రైల్వే రోడ్డు విస్తరణకు సహకరించండి



దుకాణ యజమానులతో మాట్లాడుతున్న మున్సిపల్ అధికారులు

హిందూపురం: పట్టణంలో రైల్వేరోడ్డును భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 70 అడుగుల రోడ్డుగా విస్తరించడానికి వ్యాపారులు, ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు సూచించారు. శుక్రవారం రైల్వేరోడ్డులో ఇంకా భవనాలు తొలగించుకోలేని వ్యాపారులను కలసి చర్చించారు. కలెక్టర్ ఆదేశాలతో ప్రజావసరాలకు అవసరమైన స్థలం వరకూ తొలగించడానికి అనుమతులున్నాయి.. అయినా అందరి సహకారంతో ముందుకు పోదామని వ్యాపారులు, ప్రజలను కోరుతున్నామన్నారు. త్వరితగతిన నిర్దేశిత అడుగులు తొలగించుకుంటే ఇరువైపులా కాలువలు నిర్మించి రోడ్డు నిర్మాణానికి ముందుకు పోవడానికి అవకాశం ఉంటుందన్నారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

రొద్దం: మండల కేంద్రంలోని జగనన్న లేఅవుట్‌లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, హౌసింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్ రంగనాథ్‌నాయక్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సోని పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ లేఅవుట్‌లో ఇప్పటిదాకా నిర్మాణాలు ప్రారంభించని వారు వెంటనే పనులు మొదలుపెట్టాలన్నారు. నిర్మాణం పూర్తయిన పునాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు సూచించారు.

సేంద్రియ పద్ధతులతో అధిక దిగుబడి



మెళవాయిలో పొలంబడి నిర్వహిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: సేంద్రియ పద్ధతుల ద్వారా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం డివిజన్ ఇన్‌చార్జ్ రమేష్ పేర్కొన్నారు. మెళవాయి రైతు భరోసా కేంద్రం పరిధిలోని పొలాల్లో శుక్రవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలకు తెగుళ్లు వ్యాపించకుండా ముందు జాగ్రత్తగా సస్యరక్షణ పద్ధతులు పాటించాలన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందించే రాయితీ పథకాలు, ఆర్బీకే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్ తనిఖీ



ఈ-క్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ రంగనాయకులు

గోరంట్ల: మండల పరిధిలోని పులేరు, రాగిమాకులపల్లి, గౌనివారిపల్లి, మలసముద్రం, జక్కసముద్రం గ్రామాల్లో శుక్రవారం ఈ-క్రాప్ బుకింగ్‌పై తహసీల్దార్ రంగనాయకులు సూపర్‌చెక్ నిర్వహించారు. గతంలో వ్యవసాయ అధికారులు, గ్రామ రెవెన్యూ అధికారులు సంయుక్తంగా చేపట్టిన ఈ-క్రాప్ వివరాల మేరకు పరిశీలించారు. ఈ-క్రాప్ బుకింగ్ వల్ల అర్హులైన ఏ ఒక్క రైతుకూ నష్టం జరగకుండా సూపర్ చెక్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మహబుబ్ బాషా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సోమశేఖరరెడ్డి

రొద్దం: ప్రతి విద్యార్థి తమ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ సోమశేఖర్‌రెడ్డి చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని చోళేమర్రి, నారనాగేపల్లి, దొడగట్ట, రొద్దం తదితర జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు.

రాష్ట్రం దాటిన వలంటీర్ సేవలు



పింఛన్ ఇస్తున్న వలంటీర్ వినయ్‌కుమార్

రొద్దం: మండల కేంద్రానికి చెందిన నాగరత్నమ్మ అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతూ కర్ణాటక రాష్ట్రం పెద్దబళ్లాపూర్‌లో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ విజయ్‌కుమార్ శుక్రవారం పెద్దబళ్లాపూర్‌లోని ఆస్పత్రికి వెళ్లి, పింఛన్ సొమ్ము అందజేశారు.

'జగనన్న గోరుముద్ద'లో మెనూ పాటించండి

గుడిబండ: జగనన్న గోరుముద్ద పథకంలో మెనూ పాటించాలని ఎంఈఓ శ్రీధర్ ఏజెన్సీ నిర్వహకులకు సూచించారు. శుక్రవారం హిరేతుర్పి, చిగతుర్పి ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. భోజనం రుచిగా ఉంటుందో లేదో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల వర్క్‌బుక్‌లను పరిశీలించి పలు సూచనలు చేశారు.